అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
ఆదివారం 11 జూన్ 2023

నేడు తెలంగాణ సాహిత్య దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ సాహిత్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు జడ్పీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి కవి సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పి.ఎస్ తెలిపారు. తెలంగాణ అస్తిత్వం-తెలంగాణ సాధించిన ప్రగతి అనే అంశంపై తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ కవులు కవితాగానం చేయనున్నారని తెలిపారు. ఇట్టి తెలంగాణ సాహిత్య దినోత్సవంలో కవులు, సాహితీవేత్తలు ప్రముఖులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

రామాయిలో గడప గడపకు కాంగ్రెస్



అదిలాబాద్‌రూరల్ : మండలంలోని రామాయి గ్రామంలో శనివారం డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ రైతు, యువత డిక్లరేషన్లపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణాలను మాఫీ చేస్తామన్నారు. రైతులకు ఎకరాకు రూ.15000 రైతుబంధు ఇస్తామని, ప్రతి పేదింటి ఆడబిడ్డకు గ్యాస్ సిలిండర్‌కు రూ.500 ఇస్తామన్నారు. ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే కనీసం రూ.5000 పెన్షన్ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్ పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలపై జీపు జాతా



నవతెలంగాణ-నిర్మల్

అంగన్వాడీ సమస్యలపై జూన్ 16 మధ్యాహ్నం 2గంటలకు రాష్ట్ర జీపు జాతా జిల్లాకు వస్తుందని, అంగన్వాడి యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.శైలజ అన్నారు. సీఐటీయు కార్యాలయంలో శనివారం జాతా పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఐసీడీఎస్‌కు బడ్జెట్ కేటాయించాలన్నారు. జూన్ 16న ఆదిలాబాద్‌లో జీపు జాతా ప్రారంభమవుతుందని, మధ్యాహ్నం 2గంటలకు నిర్మల్ జిల్లాకు వస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలో సభ ఉంటుందన్నారు. ఈ జీపు జాతకు జిల్లాలోని అంగన్వాడీ టీచర్స్, ఆయాలు పెద్ద సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తులసి, రేఖ, చంద్రకళ, గోదావరి, యమున, గంగామణి, గోదావరి, సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు క్లామెంట్ వెస్లీ పాల్గొన్నారు.

రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోంది..

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

రాష్ట్రంలో సుపరిపాలన కొనసాగుతోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం దివ్యగార్డెన్‌లో తెలంగాణ సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. స్వరాష్ట్రం సిద్ధిస్తేనే ప్రజలకు చక్కటి పాలన అందిస్తామని, 2001లోనే రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మదిలో ఒక దృఢసంకల్పం ఏర్పరచుకున్నారన్నారు. రాష్ట్రం సిద్ధించిన తరువాత అందరి ఆలోచనలకు అనుగుణంగా జిల్లాల పునర్విభజనతో సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా ఉంటూ, అత్యంత పారదర్శకమైన సుపరిపాలన అందించడానికి వివిధ శాఖలను పునర్వ్యవస్థీకరించి, సిబ్బందితో పాటు అధికారాలు, అవసరమైన నిధులు అందజేస్తూ బలోపేతం చేస్తున్నారని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగా ఉన్నపుడు వివిధ పనుల నిమిత్తం వ్యయ ప్రయాసాలకోర్చి వెళ్లినా కొన్ని సార్లు పనులు అయ్యేవి కావని, కానీ నేడు నూతనంగా నిర్మల్ జిల్లా ఏర్పాటుతో పాటు రెవెన్యూ డివిజన్లు, మునిసిపాలిటీలు, మండలాలు, గ్రామ పంచాయతీల ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రజలకు మరింత చేరువై సుపరిపాలన అందించడానికి, మానిటరింగ్ చేయడానికి సులువైందని పేర్కొన్నారు. అన్ని కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా నిర్మించిన సమీకృత నూతన కలెక్టరేట్‌ను ప్రారంభించుకున్నామని అన్నారు. జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైందన్నారు. కొత్తగా ఇంజనీరింగ్ కాలేజ్, ఐటీ టవర్ రాబోతున్నాయని తెలిపారు. కలెక్టర్ వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరువాత చేపట్టిన సంస్కరణలు, సుపరిపాలన, ప్రజలకు అందుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను మననం చేసుకోవడానికే 21 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. తెలంగాణా ప్రభుత్వం ప్రజలకు చేరువలో సుపరిపాలన అందిస్తూ మన్ననలు పొందుతోందని పేర్కొన్నారు. ప్రతి కార్యక్రమంలో పారదర్శకత ఉండేలా ఆన్‌లైన్ వ్యవస్థను పటిష్ఠ పరిచి టీఎస్ ఐపాస్, టీఎస్ బిపాస్, ధరణి, మీ-సేవ వంటి విధానాల ద్వారా ఒక్క పైసా ఖర్చు లేకుండా గడువులోగా అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాలు తీసుకెళ్లడం కోసం కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాలు, నూతన పురపాలికలు, గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. అంతకుముందు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జడ్పీ చైర్పర్సన్ విజయలక్ష్మి, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్‌పి ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్యేలు రేఖానాయక్, విఠల్‌రెడ్డి, డీఎఫ్ఓ హిరామాత్ సుపరిపాలన డాక్యుమెంటరిని వీక్షించారు. జడ్పీ సీఈఓ సుధీర్ జిల్లా ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్‌డీఓ స్రవంతి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాజీతోనే కేసుల పరిష్కారం



నవతెలంగాణ-ఉట్నూర్

కేసుల పరిష్కారంలో ఇరువురు కక్షిదారులు రాజీ కుదుర్చుకోవడంతోనే కేసులను పరిష్కరించుకోవచ్చని ఉట్నూర్ సివిల్ కోర్టు జడ్జి దుర్గారాణి అన్నారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జడ్జి మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కోర్టులలో పెండింగ్ ఉన్న కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు లోక్ అదాలత్ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. రాజితోనే ఎలాంటి కేసునైనా పరిష్కరించుకోవచ్చన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసు అధికారులు ఉన్నారు.

తండ్రి మందలించాడని డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



డిగ్రీ చదువుతున్న ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వన్ టౌన్ సిఐ సత్యనారాయణ వివరాల ప్రకారం..తలమడుగు మండలం పల్లి(కే) గ్రామానికి చెందిన ఆత్రం వెంకటమ్మ(19) ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో బీఏ రెండవ సంవత్సరం చదువుతోంది. పట్టణంలోని అశోక్ రోడ్డులో గల ఓ ఇంట్లో అద్దెకు ఉంటుంది. ఆమెతో పాటు మరో ఇద్దరు అమ్మాయిలు కూడా అద్దెకు ఉంటూ డిగ్రీ చదువుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో వెంకటమ్మను కలిసేందుకు తండ్రి ఆత్రం అర్జున్ వచ్చాడు. తరచూ ఫోన్ పట్టుకోవడం చూసిన తండ్రి ఫోన్ పట్టుకోకు చదువుకో అని కాస్త మందలించాడు. మనస్తాపానికి గురైన ఆమె క్షణికావేశంలో శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట దాటాక ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బాత్రూం కోసం నిద్ర లేచిన స్నేహితురాలు వెంకటమ్మ బెడ్‌పై కనబడకపోకడంతో పక్క రూమ్‌లో వెళ్లి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. ఇది చూసిన సదరు యువతి భయాందోళనకు గురైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. తండ్రి ఆత్రం అర్జున్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా గర్జన వాల్ పోస్టర్ విడుదల



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

చలో కొత్తగూడెం ప్రజా గర్జన బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం మావల మండల కేంద్రంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముడుపు నళినిరెడ్డి మండల నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ అవినీతి పాలనపై పోరాటం చేయడానికి లక్షలాది మందితో బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. బిజెపి ప్రభుత్వ అసమర్థత దేశాన్ని నడిబజార్‌లో నిలబెట్టిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని ప్రయివేటుకు అప్పగించడానికి నడుం బిగించిందన్నారు. దేశంలో గ్యాస్, పెట్రోల్, నిత్యావసర ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. బీజేపీని తరిమికొట్టడానికి 2024లో ప్రజలందరు సిద్ధం కావాలని పేర్కొన్నారు. బీజేపీ మరోసారి వస్తే దేశం వినాశనమేనని, ఇలాంటి ప్రభుత్వాలపై ప్రజలు సమరభేరి సాగించాలని కోరారు. అందుకే కొత్తగూడెం బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. పోరాట గడ్డ అయిన ఖమ్మం జిల్లాకు ప్రజలు వేలాదిగా తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు షేక్‌పాషా. వెల్పుల్ సుభాష్. ఆర్టీసీ యూనియన్ జిల్లా నాయకులు ఆనందం కిషన్, మహిళా సంఘం నాయకురాలు తారాబాయి, కాంతాబాయి, నవీన్, భూమన్న, పెద్ది నర్సిములు, శంకర్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య

- జిల్లాకు 98శాతం పాఠ్య పుస్తకాలు వచ్చాయి
- ఈ నెల 28తేదీన పిల్లలకు దుస్తులు అందజేస్తాం
- నవతెలంగాణతో డీఈఓ టి.ప్రణీత

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని.. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి టి.ప్రణీత అన్నారు. ఇప్పటికే బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించామని కొత్తగా 5వేల మంది విద్యార్థులు సర్కారు బడుల్లో చేరారని తెలిపారు. బడుల్లో మౌళిక సదుపాయాలు కల్పించడంతో పాటు మెరుగైన విద్యను అందించేందుకు విద్యాశాఖ, ఉపాధ్యాయులు నిరంతరం కృషిచేస్తారని చెప్పారు. టీచర్లు లేని బడుల్లోనూ నియమించేందుకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడుతున్నామన్నారు. సోమవారం నుంచి పాఠశాలలు పున ప్రారంభమవుతున్న దృష్ట్యా బడుల్లో సౌకర్యాలు..2023-24 విద్యా సంవత్సరంలో తీసుకుంటున్న చర్యలపై నవతెలంగాణకు వివరించారు. ఆమె మాటల్లోనే వివరాలు ఇవి

పాఠ్యపుస్తకాలు..దుస్తులు వచ్చాయి

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 678 పాఠశాలలు ఉండగా సుమారు 70వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరికి గాను సుమారు 5.70లక్షల పుస్తకాలు అవసరమవుతాయి. ఇప్పటి వరకు జిల్లాకు 5.21లక్షల పుస్తకాలు వచ్చాయి. మిగిలిన 49వేల పుస్తకాలు రావాల్సి ఉంది. ఇప్పటికే చేరిన పాఠ్యపుస్తకాలను మండలాల వారీగా పాఠశాలలకు పంపిస్తాం. ముఖ్యంగా విద్యార్థులకు అందించే సమరూప దుస్తులు కూడా వచ్చాయి. కుట్టుకోసం దర్జీలకు అప్పగించాం. 80శాతం కుట్టడం ఆయిపోయింది.ఈ నెల 28వతేదీన పాఠశాలల్లో విద్యార్థులకు అందించాలని ఇది వరకే ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశాం. అసలే ఉపాధ్యాయులు లేని పాఠశాలలు అతి తక్కువగా ఉన్నాయి. సోమవారం నుంచి ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈఓలకు సూచించాం.

మన బడి పనులు పూర్తవుతున్నాయి

సర్కారు బడుల్లో మౌళిక సదుపాయాల కోసం ప్రభుత్వం మన ఊరు- మనబడి కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లాలో తొలి విడత కింద 237 పాఠశాలలను ఎంపిక చేసింది. ఇప్పటికే సుమారు 130పాఠశాలల్లో 12 అంశాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాం. ఇప్పటికే అనేక పాఠశాలలను ప్రారంభించాం. మిగితా వాటిలో కూడా పనులు త్వరగా పూర్తిచేసి విద్యార్థులకు సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తాం. ఈ నెల 1వ తేదీ నుంచి ప్రారంభించిన బడిబాట కార్యక్రమానికి మంచి స్పందన వస్తోంది. ఉపాధ్యాయులు ఆయా గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులను సర్కారు బడుల్లో చేర్పిస్తున్నారు. ఇప్పటి వరకు 5వేల మంది విద్యార్థులు కొత్తగా బడుల్లో చేరారు. మరికొన్ని రోజుల్లో ఇంకా అనేక మంది చేరేందుకు అవకాశం ఉంది. సర్కారు బడుల్లో బోధనలో అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉండటం.. ప్రభుత్వం సౌకర్యాలు కల్పించడం మూలంగా అనేక మంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. సోమవారం నుంచి పాఠశాలలు పున ప్రారంభం అవుతున్న దృష్ట్యా ఉపాధ్యాయులు, విద్యార్థులకు ప్రత్యేక శుభాకాంక్షలు చెబుతున్నానని వివరించారు.



ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ



నవతెలంగాణ-బజార్‌హత్నూర్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడే గజేందర్ తెలిపారు. శనివారం మండలంలోని టెంబి, ఆర్కాయి, భీమ్లానాయక్ తండా గ్రామాల్లో గడపగడపకు కాంగ్రెస్ అనే నినాదంతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వరంగల్ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ పెద్దలు మాట్లాడినట్టుగా 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ప్రతి ఎకరాకు 15 వేల రూపాయలు, వృద్ధులకు 5000 రూపాయల పింఛను, యువతకు నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ చేస్తామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు సామాన్పల్లి శేఖర్, దేవన్న, రామ్‌సింగ్, మురళీ, సంతోష్, రోహిదాస్, పోశెట్టి పాల్గొన్నారు.

హోంగార్డులు పెన్షన్ ఆధారిత పథకాల్లో చేరాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హోంగార్డులు పెన్షన్ ఆధారిత పథకాలలో చేరాలని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో 38 సంవత్సరాల పాటు హోంగార్డుగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన కె.విఠల్ ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంగార్డుకు సిబ్బంది సమక్షంలో శాలువా, పూలమాల, బహుమతిని అందజేసి సత్కరించారు. విఠల్ 1985లో పోలీస్ శాఖలో అడుగుపెట్టి ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ఎక్కువ కాలం పని చేశారన్నారు. నమ్మకంగా ఉంటూ విధులను నిర్వర్తించే వారని తెలిపారు. హోంగార్డులకు ప్రభుత్వం ద్వారా ఎటువంటి పెన్షన్ లభించదని, ఉద్యోగంలో ఉన్నప్పుడే ప్రైవేటు రంగంలో కానీ, ప్రభుత్వ రంగంలో కానీ పెన్షన్ లభించే పథకాలలో చేరి పదవీ విరమణ అనంతరం నిశ్చింతగా ఉండే విధంగా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. హోంగార్డుల విధులు నిస్వార్థమైన సేవకు నిదర్శనమని కొనియాడారు. జిల్లాలోని నిరుద్యోగ పోలీసు పిల్లలకు ప్రత్యేకంగా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలను కల్పించే విధంగా ప్రోత్సహిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్ శ్రీనివాసరావు, సమయ్ జాన్‌రావు, డీఎస్పీలు వి.ఉమేందర్, పోతారం శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, సిఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, హోంగార్డ్ అర్ఐ బి శ్రీపాల్, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, హోంగార్డ్ ఇన్చార్జి హెడ్ కానిస్టేబుల్ రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

కక్షిదారులకు రాజీ మార్గమే ఉత్తమం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్‌ఆర్ వరప్రసాద్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాజీమార్గం ద్వారా కేసును పరిష్కరించుకుంటే ఇరువర్గాలు గెలుస్తాయని, కక్షిదారులిద్దరికి లోక్ అదాలత్ తీర్పు ప్రయోజనకరంగా ఉంటుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని డీఎల్ఎస్ఏ సమావేశ మందిరంలో జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని, చెల్లించిన రుసుము సైతం వెనక్కి ఇచ్చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఈ రుసుము కలెక్టర్ ద్వారా చెల్లిస్తున్నారని తెలిపారు. తాను హైకోర్టు అధికారులతో మాట్లాడి లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులకు సబంధించిన రుసుమును కక్షిదారులకు జుడిషియల్ అధికారుల ద్వారానే చెల్లించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కొన్నిచోట్ల గ్రామ కమిటీలే వివాదాలను వారి గ్రామంలో రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తున్నాయన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే సమయం, డబ్బు రెండు ఆదా చేసుకోవటంతోపాటు స్నేహభావం పెరుగుతుందని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారం కోసం నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవాలన్నారు. అదేవిధంగా అందరి సమిష్టి కృషి వల్ల పీసీఆర్ కోర్టుకు జడ్జిగా దుర్గాభవానీ రాబోతున్నారని, సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. అలాగ్ ఆయన ప్రత్యక్షంగా కొంతమంది కక్షిదారులతో మాట్లాడి రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శివారం ప్రసాద్, ప్రమీల జైన్, మంజుల, వినియోగదారుల హక్కుల కమిషన్ చైర్మన్ జాబెజ్ శామ్యూల్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌ను నియమిచాలి

ఆదిలాబాద్‌అర్బన్ : ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌ను వెంటనే నియమించాలని టిఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ ప్రభుత్వాన్ని శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2021 నుండి సీఎం కేసీఆర్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను నియమించలేదని, వెంటనే నియామకాన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీలపై దాడులు పెరిగిపోతున్నాయని, కమిషన్ చైర్మన్ లేకపోవడంతో పోలీసులు సైతం దళితుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ సమస్యలను కమిషన్ దృష్టికి తీసుకెళ్లడానికి వీలుగా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించాలని కోరారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

తాంసి : మంచిర్యాల బహిరంగ సభలో దివ్యాంగులకు వెయ్యి రూపాయల పెన్షన్ పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడంతో శనివారం మండల కేంద్రంలోని బస్టాండ్ అవరణలో దివ్యాంగులు కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగులు ఎలాంటి పనులు చేయలేని పరిస్థితిలో ఉండటంతో ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌పైనే ఆధారపడి జీవితాన్ని గడుపుతున్నామన్నారు. ఇప్పుడు ఇస్తున్న మూడువేల 16 రూపాయల పెన్షన్ సరిపోదని గ్రహించి మరో వెయ్యి రూపాయలు పెంచడం సంతోషంగా ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ స్వప్న రత్న ప్రకాష్, దివ్యాంగులు ఆశన్న, సతీష్, విద్యాధర్, నాయకులు మహేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయ బస్టాండ్‌లో యాచకుని మృతదేహం

బాసర : ఆలయ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం వృద్ధుని మృతదేహం స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ మహేష్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆలయ పరిసరాలలో యాచకునిగా జీవనం సాగిస్తున్న వృద్ధుడు కొన్ని సంవత్సరాలుగా ఇక్కడే ఉంటున్నాడని తెలిపారు. వయస్సు 60 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ : ఎస్పీ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గ్రూప్-1 పరీక్షా కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న బందోబస్తును అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివారం జిల్లా కేంద్రంలో 19 పరీక్షా కేంద్రాలలో 6190 అభ్యర్థులు గ్రూప్-1 ప్రాథమిక పరీక్షను రాయనున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. పరీక్షా కేంద్రాల బయటి బందోబస్తు ప్రక్రియ పోలీసు శాఖ ద్వారా నిర్వహించబడుతుందని, అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంతంగా పరీక్షను పూర్తి అయ్యేవిధంగా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఉదయాన్నే పరీక్షా కేంద్రాల పూర్తి తనిఖీ నిర్వహించి ఇతరులు ఎవరూ పరీక్షా కేంద్రంలో ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించి, పరిశీలించి పరీక్షా కేంద్రంలోనికి అనుమతించాలని సూచించారు. పరీక్షా కేంద్రంలోని ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదన్నారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రదేశంలోనే మహిళా అధికారులతో తనిఖీ నిర్వహించాలన్నారు. పరీక్షా కేంద్రం చుట్టుపక్కల పరిసరాలను ముందే పరిశీలించాలన్నారు. బందోబస్తులో అడిషనల్ ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 16 మంది సీఐలు, 30 మంది ఎస్ఐలు, 26 మంది ఏఎస్ఐలు, 42 మంది హెడ్ కానిస్టేబుల్, 164 మంది కానిస్టేబుల్, 30 మంది హోంగార్డులు స్పెషల్ పార్టీ, బిడి టీం, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. పట్టణంలో పరీక్ష కేంద్రాల వద్ద గల జిరాక్స్ సెంటర్స్ అన్నింటిని మూసివేయాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు బయలుదేరిన సమయం నుండి జవాబు పత్రాలు సంబంధిత భద్రమైన ప్రదేశాలకు చేరేంతవరకు బాధ్యత పోలీసులపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ సి సమైజాన్ రావు, డీఎస్పీలు వి ఉమేందర్, ఉమామహేశ్వరరావు, సిఐలు, ఎస్ఐలు, రిజర్వ్ సిబ్బంది, స్పెషల్ బ్రాంచ్, డిసిఆర్బి, సిబ్బంది పాల్గొన్నారు.

చేనేత, హస్తకళ హ్యాండ్‌లూమ్, హ్యాండి క్రాఫ్ట్స్ ప్రారంభం

నవతెలంగాణ-నిర్మల్

పట్టణంలోని ఇంద్రనగర్ ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ హ్యాండ్ లూమ్, హ్యాండి క్రాఫ్ట్స్‌ను శనివారం మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. వివిధ రకాల ప్రాంతాల్లో చేతితో తయారు చేయబడినవి ఒకే దగ్గర పట్టణ ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. పలు రకాల చేనేత వస్త్రాలను, చేతితో తయారు చేయబడిన వస్తువులను పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అడప పోశెట్టి, కోఆప్షన్ సల్మాన్, జాఫర్ఉద్దీన్ పాల్గొన్నారు.

ఐటీఐలో అడ్మిషన్ల గడువు పొడిగింపు

ఆదిలాబాద్‌టౌన్ : ప్రభుత్వ ప్రయివేట్ ఐటీఐ కళాశాలలో అడ్మిషన్లు పొందేందుకు ఈనెల 10 శనివారంతో గడువు ముగియగా ఈ నెల 19 వరకు పొడగించినట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ సుజాత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తి గల విద్యార్థిని, విద్యార్థులు ఐటిఐలో ప్రవేశాల కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

www.navatelangana.com
నవతెలంగాణ
ఆదిలాబాద్, నిర్మల్
ఆదివారం 11 జూన్ 2023

గ్రూప్-1 పరీక్ష కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నేపథ్యంలో ఆదివారం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను వివిధ ప్రాంతాల నుండి ఆదిలాబాద్‌కు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కల్పన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ నుండి ఉదయం 05. 00 గంటల నుండి ప్రతి 15 నిమిషాలకు ఒక బస్, బోథ్ నుండి ఉదయం 06:45, 07:45, బేల నుండి ఉదయం 06.00, 07.30, కరంజి నుండి ఉదయం 06.30, 07:00, భరంపూర్ నుండి ఉదయం 06:30, తలమడుగు నుండి ఉదయం 06.30, పెండల్‌వాడ నుండి ఉదయం 06.00 సమయాలలో బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనివారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ కనక మోతుబాయి పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు జొన్న పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2970 రూపాయలు కల్పించిందని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పండించిన ప్రతిగింజను కొనుగోలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తొడసం నాగోరావు, స్థానిక సర్పంచ్ గజానంద్ నాయక్, సర్పంచులు యుర్వత రూపదేవ్, మడావి రూపదేవ్, రాథోడ్ సావీందర్, బీఆర్ఎస్ నాయకులు ఉద్ధవ్ కాంబ్లే, ఖాసీం, ప్యాక్స్ సభ్యులు ఉన్నారు.

గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం సాకారమైంది : ఎమ్మెల్యే

● ఘనంగా సుపరిపాలన దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో గాంధీజీ కలలు గన్న గ్రామస్వరాజ్యం సాకారమైందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం స్థానిక రెవిన్యూ గార్డెన్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సుపరిపాలన దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్, ఎమ్మెల్యేలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో మిషన్ భగీరథ, మున్సిపల్, వైద్య, విద్యుత్, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ శాఖల్లో గత తొమ్మిది సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిని ఆయా శాఖల అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం కొత్త జిల్లాలు, మండలాలు, గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యోగుల కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పల్లెలే దేశానికి పట్టుకొమ్మలని, గాంధీజీ కలలు కన్నా గ్రామస్వరాజ్యం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో సాకారమైందని అన్నారు. ఈ తొమ్మిది సంవత్సరాలలో వివిధ రంగాలలో గణనీయమైన అభివృద్ధి సాధించడం జరిగిందని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి వివిధ వినూత్న పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతున్నదని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత 24 గంటల నిరంతర విద్యుత్, మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు, పల్లె, పట్టణ ప్రగతిలో మౌలిక సదుపాయాల కల్పన, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా పల్లె, బస్తీ దవాఖానల ఏర్పాటు, చెరువులు, ప్రాజెక్టుల పునర్నిర్మాణం, కొత్త మండలాల ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడిన తరువాత జిల్లాలో నూతన మండలాలు, గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డులను ఏర్పాటు చేయడంతో ప్రజలకు దూరభారం తగ్గి మెరుగైన సేవలు అందుతున్నాయని అన్నారు. 2016వ సంవత్సరంలో పరిపాలన సౌలభ్యం కొరకు పూర్వ ఆదిలాబాద్ జిల్లాను 4 జిల్లాలుగా విభజించి, 18 మండలాలతో నూతన ఆదిలాబాద్ జిల్లాను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 243 గ్రామపంచాయతీలు ఉండగా, అదనంగా 227 నూతన గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్దరణ చేపట్టి సాగు విస్తీర్ణం చేపట్టడం జరిగిందని అన్నారు. ధరణి మాడ్యూల్ ప్రవేశ పెట్టడంతో మండల కేంద్రాల్లోనే భూ సంబంధిత రిజిస్ట్రేషన్‌లు, మ్యుటేషన్‌లు చేసుకోవడం జరుగుతుందని, పట్టా పాస్ బుక్ రైతు ఇంటికే చేరడం జరుగుతుందని తెలిపారు. ప్రజకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు రహదారులు, సీసీ రోడ్లను వేయడం జరిగిందని తెలిపారు. ప్రతి శాఖలోని ఖాళీల భర్తీతో పాటు అదనపు పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ సాంస్కృతిక కళాకారుల ప్రదర్శనలు ఆహ్వానితులను అలరించాయి. అంతకుముందు అదనపు కలెక్టర్ ఎన్.నటరాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పరిపాలన సంస్కరణ ద్వారా కలిగిన మేలు, జిల్లా ప్రగతి నివేదికను సమావేశంలో వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మెన్ రౌత్ మనోహర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీఆర్డీఓ కిషన్, తహసీల్దార్ ఇమ్రాన్, సూపరింటెండెంట్లు రాజేశ్వర్, స్వాతి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-కుభీర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.3వేలు ఉన్న పెన్షన్ రూ.4,116 పెంచడంతో సీఎం కేసీఆర్, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చిత్రపటాలకు శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయంలో మండల నాయకులు దివ్యాంగులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తూము లక్ష్మీబాయి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎన్నిల అనిల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి వారికి ఆదుకునేందుకు ఎంతో కృషి చేయడం జరుగుతుందని అన్నారు. అదే విధంగా దివ్యాంగులకు అన్ని రంగాల్లో అభివృద్ధి పరిచేందుకు వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు కృషి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ కందుర్ సంతోష్, బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, పీఏసీఎస్ చైర్మెన్ రాములు, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు దత్తు గౌడ్, మండల నాయకులు డిగంబర్ పటేల్, నగలింగం సూది రాజన్న, మండల నాయకులు బీఆర్ఎస్ కార్యకర్తలు దివ్యాంగులు ఉన్నారు.

లక్ష్మణచాంద:దివ్యాంగుల పెన్షన్లు రూ.4,116 పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటించిన నిర్ణయంతో మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో శనివారం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. సీఎం కేసీఆర్ నిర్ణయంతో దివ్యాంగుల జీవితానికి కొండంత ధైర్యం లభిస్తుందని దివ్యాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు షేక్ జమాల్ పేర్కొన్నారు. అర్హులైన వారిని గుర్తించి నూతన పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన బీపీఎం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలకేంద్రంలో గత 36 సంవత్సరలుగా తపాలా శాఖ బ్రాంచ్ పోస్టు మాస్టర్‌గా విధులు నిర్వహించి శనివారం పెరుమాండ్ల రమేష్ కుమార్ పదవీ విరమణ పొందారు. ఆయన సేవలు చిరస్మరణీయమని తపాలా శాఖ సిబ్బంది, గ్రామస్తులు కొనియాడారు. వృత్తి దర్మం పాటించి కష్టపడి పనిచేస్తే ప్రతీ ఒక్కరికి గుర్తింపు లభిస్తుందని, కష్టపడి పని చేయాలని రమేష్ కుమార్ అన్నారు. అనంతరం తపాలా శాఖ ఆధ్వర్యంలో రమేష్ కుమార్‌ని ఘనంగా సత్కరించారు.

కాళేశ్వరం 28ప్యాకేజీ పెండింగ్ పనులను పూర్తి చేయాలి

నవతెలంగాణ-ముథోల్

పూర్వ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు, నేటి కాళేశ్వరం ప్రాజెక్టు కాలువ పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేసి, వెనుకబడ్డ ముధోల్ నియోజకవర్గానికి సాగునీరు అందించాలని తెలంగాణ జనసమితి ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని పలు గ్రామాల రైతులు, ప్రజలతో కలిసి చించాల, శివారులో పెండింగ్ ఉన్న 28 ప్యాకేజ్ కాలువ పనుల ను రైతులతో కలిసి పరిశీలించారు. శంకుస్థాపన చేసి 11 ఏండ్లు గడుస్తున్నా నేటికీ కాలువ పెండింగ్ పనులను పూర్తి చేయకపోవటం అన్యాయమని అన్నారు. తక్షణమే కాలువ పెండింగ్ పనులను పూర్తి చేసి పేదల భూములకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. లేని యెడల రైతులతో కలిసి ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూమన్న, రాజేశ్వర్, భోజన్న, రైతులు సాయినాథ్, అంజయ్య, గంగాధర్, పోశెట్టి, రత్నదీప్, మనోహర్, శంకర్, అర్జున్ పాల్గొన్నారు.

గర్భిణీలకు పండ్లు పంపిణీ

నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండల కేంద్రంలోని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నిరుపేద గిరిజన గర్భిణుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని వారికి ధైర్యాన్ని ఇచ్చారు. అదేవిధంగా వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆప్పిల్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డాక్టర్ పార్వతిబాయి పండ్లను అందించి, కులంకుశంగా వారికి వివరించారు. ముఖ్యంగా గర్భిణీలు, ప్రెగ్నెన్సీ 9 నెలల సమయంలో, పురిటి సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాల గురించి వారికి వివరించి, మనో ధైర్యాన్ని ఇచ్చారు. సుమారు 81 మంది నిరుపేద గిరిజన గర్భిణీలకు ఒక్కొక్కరికి పౌష్టిక ఆహారమైనటువంటి వివిధ రకాల పండ్లను, ఖర్జూరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన మహిళల బాగు కొరకు త్వరలో వారి తరుపున మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి పేద గిరిజన మహిళలకు సహాయపడతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాంషోద్దీన్, తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మైనారిటీ జనరల్ సెక్రటరీ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్, ఇచ్చోడ, ప్రేమసింగ్ చౌహన్, భీంపూర్ మండలం సీనియర్ కాంగ్రెస్ నాయకులు, నేరడిగొండ మాజీ ఎంపీటీసీ రవీందర్ రాథోడ్, డాక్టర్ విజయ సారధి, డాక్టర్ నిఖిల్ రాజ్, కౌస్తుభ విజయసారధి స్త్రీల నిపుణులు అశోక్‌రెడ్డి, స్టాఫ్‌నర్స్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ రాగితీ దొంగతనం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని కనకపూర్ గ్రామ శివారులో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 25 కేవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి రూ.70 వేల విలువ చేసే రాగితీగను దొంగిలించినట్లు విద్యుత్ శాఖ ఏఈ మహేష్ తెలిపారు. విషయం తెలిసిన వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీస్ సిబ్బంది, ఫోరెన్సిక్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించి, వేలి ముద్రలు సేకరించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఆయన వెంట లైన్ ఇన్స్‌పెక్టర్ సీతారామ్, జెఎల్ ఎం. రవితేజ ఉన్నారు.

తెలంగాణ సాధనతోనే గ్రామాల అభివృద్ధి



నవతెలంగాణ-తాంసి

తెలంగాణ సాధనతోనే మారుమూల గ్రామాలు పురోగతి సాధించడం జరిగిందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. శనివారం భీంపూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో తొమ్మిది సంవత్సరాల ప్రగతి సుపరిపాలన సాధన సమవేశం నిర్వహించారు. ఇరవై ఏడు మందికి కళ్యాణలక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ చేసిన ఉద్యమం ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. తొమ్మిది సంవత్సరాల పురోగతి సాధించడంతో సంబురాలు చేసుకోవడం జరుగతుందని అన్నారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి మండలాలు ఎర్పాటు చేయడం వల్లనే భీంపూర్ మండలం అభివృద్ధి చెందడం జరుగుతుందని అన్నారు. వచ్చే ఎన్నికలలో అందరూ ఐక్యంగా ఉండి ప్రభుత్వాన్ని మూడోసారి అధికారంలోకి వచ్చేలా పనిచేయాలని అన్నారు. మన సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన పథకాలే మళ్లీ బీఆర్ఎస్‌ను అధికారంలోకి తీసుకువస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లింబాజి, డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, తహసీల్దార్ మహేంద్రనాథ్ కోర్డినేటర్ అనిల్ ఎంపీడీఓ శ్రీనివాస్, జెడ్పీటీసీ సుధాకర్, ఎంపీపీ రత్నా ప్రభ సంతోష్, పార్టీ కన్వీనర్ నాగయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

● 19 పరీక్ష కేంద్రాలు.. 6,190 మంది అభ్యర్థులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శనివారం స్థానిక నలంద డిగ్రీ కళాశాల గ్రూప్-1 పరీక్ష కేంద్రంలోని గదులను, సీసీ కెమెరాల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం నిర్వహించనున్న గ్రూప్-1 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 19 కేంద్రాలలో 6190 మంది అభ్యర్థులు పరీక్షా రాయనున్నారని తెలిపారు. ఉదయం గం.10:30 ని.లకు పరీక్ష ప్రారంభం కానున్న దృష్ట్యా అభ్యర్థులు ఉదయం 8:30 ని.ల నుండి 10:15 ని.ల వరకు ఆయా కేంద్రాలకు చేరుకోవాలని, 10:15 ని.లకు పరీక్ష కేంద్రాల గెట్ మూసివేయడం జరుగుతుందని తెలిపారు. సమయాణాంతరం పరీక్ష కేంద్రంలోకి ఏ ఒక్కరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులతో పాటు సూపరింటెండెంట్లు, లైజన్ అధికారులు, ఇన్విజిలేటర్లు, సిబ్బందికి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్లు పరీక్ష కేంద్రాలలోనికి అనుమతిలేదని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, మెడికల్ కిట్, మరుగుదొడ్లు, డ్యూల్ డెస్కులు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని అన్నారు. మారుమూల ప్రాంతాల అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునే విధంగా ఆయా రూట్లలో బస్‌లను నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటికే పరీక్ష నిర్వహణ సిబ్బందికి శిక్షణలు ఇవ్వడం జరిగినదని తెలిపారు. గ్రూప్-1 పరీక్ష రాసే అభ్యర్థుల సందేహాల నివృత్తి కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబర్ 1800 425 1939 ను సంప్రదించాలన్నారు. ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఈ సందర్భంగా అభ్యర్థులకు కలెక్టర్ అల్ ది బెస్ట్ చెప్పారు. ఈ పరిశీలనలో పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ పున్నారావు, లైజన్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలి

● ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గొడం గణేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఐటీడీఏ పరిధిలో ప్రత్యేక డీఎస్సీని వెంటనే ఏర్పాటు చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఎలక్ట్రానిక్ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక డీఎస్సీని వేసి ఆదివాసీ యువతీ, యువకుల చేతనే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా కమిటీ పక్షాన డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్‌లో ఎస్ఏ, ఎస్‌జీటి, ఇతర ఖాళీ పోస్టులు 2,142, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 1,085 ఖాళీ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్ మెంట్ పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. తద్వారా ఆదివాసుల విద్య పూర్తిగా అగమ్య గోచరంగా తయారైందని ధ్వజమెత్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలు, హైస్కూల్‌లలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి కైన ప్రభుత్వం, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు వెంటనే స్పందించి, రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న సీఆర్‌టీ పోస్టులను ఆదివాసీ యువతీ, యువకుల చేతనే నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యామ్ రావు, నాయకులు వెట్టి మనోజ్, గోడం రేణుక, ఉయిక ఇందిరా, సలాం వరుణ్, గెడం శివకృష్ణ, ఆత్రం గణపతి, మెస్రం దినేష్, సోయం భీమ్‌రావు, తొడసం ప్రకాష్ పాల్గొన్నారు.

మాలీలు ఐక్యంగా ఉండి ఎస్టీ హోదా సాధించుకోవాలి



నవతెలంగాణ-తాంసి

మాలిలంతా ఏకతాటిపైకి వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచి ఎస్టీ హోదా సాధించుకోవాలని అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేట్కులే అన్నారు. శనివారం తాంసి మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేసి, మండలంలోని తాంసి, కప్పర్ల, రామ్ నగర్, గిరిగాం గ్రామ మాలీ కుల పెద్దలతో కలిసి మండల రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని చేస్తున్న పోరాటాలను గుర్తించి, రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. కానీ మాలీ కులస్తులు ఇంతటితో ఆగకుండా కేంద్రాన్ని ఒప్పించి కేంద్రంపై ఒత్తిడి పెంచి బిల్లు ఆమోదింప చేసుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే ఎస్టీ హోదా జీఓ తీయించే వరకు విశ్రమించకూడదని అన్నారు. మాలీ పటేళ్ల సంఘాన్ని బలోపేతం చేయడానికి కల్యాణలక్ష్మి, కుల ధృవీకరణ పత్రాలపై మాలీ పటేల్ సంఘ అధ్యక్షుల సంతకాలు లేనిదే మండల రెవెన్యూ అధికారులు కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయడం, కల్యాణలక్ష్మి పథకాలను వర్తింప చేయడం చేయకూడదని ఇది మాలీ సంఘ ఐక్యతకు తీసుకున్న సంఘ నిర్ణయమని తెలిపారు. మాలీ సంఘం యువజన ప్రతి ఒక్కరినీ చైతన్య పర్చాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలీ మహా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబన్న శెండే, పటేల సంఘం జిల్లా అధ్యక్షులు రాగి గంగారం, జిల్లా అధ్యక్షులు వాడగురే విజయ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు ధనంజయ ప్రధాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి వాడగురే ఉత్తం, తాంసి మహాజన్ పటేల్ ఆశన్న చౌదరి, కప్పర్ల మహాజన్ పటేల్ దారట్ల సదాశివ్, గిరిగాం పటేల్ బెల్లపు గంగారాం, రామ్‌నగర్ పటేల్ ప్రధాన్ గంగారాం పాల్గొన్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్‌కు ప్రశంసాపత్రం అందజేత

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ రమేష్ గత 7 సంవత్సరాలుగా తన విధులు నిర్వహిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ఉద్యోగ శిక్షణ అందిస్తూ ఇప్పటి వరకు 156 మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందటంలో తనవంతు కృషి చేస్తున్నారు. దీన్ని జిల్లా అధికార యంత్రాంగం తన సేవలను గుర్తించి ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల సందర్భంగా ఎమ్మెల్యే జోగు రామన్న, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ చేతుల మీదుగా డాక్టర్ రమేశ్ ప్రశంస పత్రాన్ని శనివారం అందుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ ఈ అవార్డ్‌కి ఎన్నిక చేసిన ప్రభుత్వ అధికార కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రమేష్‌ని పలువురు అభినందించారు.

సీఆర్టీల నియామకం పారదర్శకంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలో నూతన సీఆర్టీల నియామకాలు పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి పూసం సచిన్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీడీఏ అధికారులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఖాళీల సంఖ్య ప్రకటన రూపంలో వెల్లడించకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. సదరు పోస్టులను అధికారులకు సమీపంగా ఉన్న వారికే కేటాయిస్తారేమోననే అనుమానం ఆదివాసీ అభ్యర్థుల్లో నెలకొంటుందని పేర్కొన్నారు. సీఆర్టీల భర్తీ ప్రక్రియ రహస్యంగా చేయకుండా మెరిట్ ననుసరించి ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. జాబితాను బహిరంగ ప్రదర్శనకు సైతం ఉంచాలని కోరారు. లేని పక్షంలో టాగ్స్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

ఈనెల 14 నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 14వ తేదీ నుంచి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ పి. భరద్వాజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్లాటు బుకింగ్, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల ధృవీకరణకు ఈ నెల 14 నుంచి 18 వరకు కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు వెంట పాలీసెట్ ర్యాంకు కార్డు, హాల్ టికెట్, ఎస్సెసీ మెమో, నాలుగో తరగతి నుంచి పదో తరగతి వరకు బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు తీసుకురావాలని సూచించారు. సర్టిఫికెట్ల ధృవీకరణ తర్వాత ఆన్‌లైన్‌లో 16 నుంచి 21 వరకు కళాశాలల ఎంపిక, ఈ నెల 25న సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. ట్యూషన్ ఫీజు చెల్లింపు అనంతరం ఈ నెల 29లోగా సంబంధిత కళాశాలలో రిపోర్టు చేయాలని తెలిపారు.

సీఎం ప్రకటనతో 490 మంది దివ్యాంగులకు లబ్ధి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ సీఎం కేసీఆర్ దివ్యాంగులకు శుభవార్త వినిపించారు. దివ్యాంగుల పెన్షన్ మరో వెయ్యి రూపాయలు పెంచుతున్నట్టు కేసీఆర్ ప్రకటించారు. ఇప్పటికే దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేల 116 ఉండగా మరో వెయ్యి పెంచి మొత్తంగా రూ.4 వేల 116 ఇవ్వనున్నట్టుగా ప్రకటించారు. మంచిర్యాలలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ప్రగతి నివేదన సభలో శుక్రవారం సీఎం కేసీఆర్ ప్రకటనతో మండలంలో మొత్తం 8268 పెన్షన్లు ఉండగా ఇందులో దివ్యాంగులు 490 మంది ఉన్నారు. వీరందరికి లబ్ధి చేకూరనుంది. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో దివ్యాంగులకు పెన్షన్లు అందిస్తున్నామని బీఆర్ఎస్ నాయకులు గర్వంగా చెప్పుకుంటున్నారు. మొత్తానికి సీఎం కేసీఆర్ ప్రకటనతో దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో జీవితంలో ఉన్నత స్థాయిలో ఉండేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

దివ్యాంగుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు షేక్ జమాల్



దివ్యాంగులకు వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచుతూ సీఎం కేసీఆర్ చేసిన ప్రకటన చాలా సంతోషం కలిగించింది. దివ్యాంగుల అభ్యున్నతికి పాటు పడుతున్న ప్రభుత్వానికి అభినందనలు సీఎం కెసిఆర్ కు ప్రత్యేక కతజ్ఞతలు తెలుపుతున్నాం.

ఘనంగా ఇప్ప పువ్వు పండుగ

నవతెలంగాణ-ఉట్నూర్

ఇప్పపువ్వు పండుగ మండల కేంద్రంలోని కేబి కాంప్లెక్స్‌లో సమావేశ మందిరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయి, ఏటీడబ్ల్యుఎస్ చైర్మెన్ కనక లక్కేరావుతో పాటుగా ఆదివాసీ పెద్దలు, మహిళలు హాజరయ్యారు. ముందుగా ఇప్పచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పపువ్వు ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఇప్పలడ్డులు గర్భిణీ మహిళలకు గొప్పవరమని అన్నారు. ఇప్ప లడ్డు ద్వారా మహిళల్లో రక్తహీనత సమస్యను దూరం చేయవచ్చని, సర్వ ఔషధ గుణాల సమూహం ఇప్పచెట్టేనని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మ శ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, మాజీ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు నీలబాయి, జీవ వైవిధ్య నిర్వహణ కమిటీ సభ్యులు మర్సుకొల తిరుపతి, జిల్లా సార్మేడి దుర్గు, ఐటీడీఏ డైరెక్టర్ భూమన్న, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు విఠల్ రావ్, బాగుబాయి ఉన్నారు.

కలెక్టర్, ఎమ్మెల్యేకు వినతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు అందించే రూ.లక్ష రుణ సాయం తమకు కూడా వర్తింపజేయాలని మున్నూరు కాపు కులస్తులు కోరారు. ఈ విషయమై శనివారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, ఎమ్మెల్యే జోగు రామన్నలను ఓ కార్యక్రమంలో కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని వారు హామీ ఇచ్చారు. తాలూకా మున్నూరు కాపు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్, రాకేష్, ఆజాద్ ఉన్నారు.

రేపు బాలకార్మిక నిర్మూలనపై అవగాహన

నవతెలంగాణ-అదిలాబాద్‌టౌన్

ప్రపంచ బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 12న బేల మండలం భవానీగూడ గ్రామంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆదిలాబాద్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అవగాహన సదస్సు ప్రారంభమవుతుందని అన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాళ్ళపెల్లి రాజేశ్వర్

నవతెలంగాణ-జన్నారం



తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తాళ్ళపెల్లి రాజేశ్వర్ నియమితులయ్యారు. సందర్భంగా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాలు జారీ చేశారు. గతంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షునిగా చురుకైన పాత్ర పోషించినందుకు గుర్తించి ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం రాజేశ్వర్, అదిలాబాద్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతుండగా అదనంగా రాష్ట్ర బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌కి ఎస్సీ సెల్ అధ్యక్షులు పొలంపల్లి అశోక్‌కు కృతజ్ఞులు తెలియజేశారు. భవిష్యత్‌లో పార్టీ అభివృద్ధికి నావంతు కృషి చేస్తూ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండ కడతానని తాళ్లపల్లి రాజేశ్వర్ తెలిపారు.

పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి కాలరీస్ నస్పూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం సింగరేణి ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల పిల్లలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం జి.దేవేందర్ కోరారు. కళాశాలలో మొత్తం సీట్లు 150 కాగా అందులో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం సీట్లు 30, మెకానికల్ సీట్లు 30, సివిల్ సీట్లు 30, కంప్యూటర్ విభాగం సీట్లు 30, మైనింగ్ సీట్లు 30 బర్తీ చేస్తారని తెలిపారు. పాలిసెట్‌లో అర్హత పొందిన విద్యార్థులు మాత్రమే అర్హులని అన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెం 23 తేది లోపు ఎస్‌సీపీఓఎల్‌వైటీఈసీహెచ్‌ఎన్ఐసీ.సీఓఎం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని డౌన్లోడ్ చేసిన దరఖాస్తులను సంబందిత మైన్ డిపార్ట్మెంట్ అధికారితో అటూస్టేషన్ చేయించి కౌన్సిలింగ్ ఈ నెల 27న ఒర్జినల్ సర్టిఫికెట్స్‌తో పాటు సీసీసీ నస్పూర్ లోని కళాశాలకు హాజరుకావాలి తెలిపారు. ఈ అవకాశాన్ని సింగరేణి కుటుంబీకుల పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోడు భూములు సర్వే చేసి అర్హులకు పట్టాలు ఇవ్వాలి

నవతెలంగాణ-జన్నారం

పోడు భూముల సర్వే నిర్వహించి అర్హులకు పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా నాయకులు ఎస్కే అబ్దుల్లా అన్నారు. శనివారం మండలంలోని బాదంపల్లి, కొమ్ముగూడా చింతలపల్లి, పొనకల్, గ్రామాలకు చెందిన పలువురు సీపీఐలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఇంటి స్థలంతో పాటు ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. గిరిజన సమస్యలపై సీపీఐ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ప్రతి పేదవానికి రేషన్ కార్డులు అందించాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన మహిళలు అజిరా బేగం, భాగ్యలక్ష్మి సాదం, అమ్మాయి, గిరిజా బాయి, హడాయి యశోద, అన్నిబాయి, గడ్డం విజయ్, కోడిపల్లి రవి పాల్గొన్నారు.

నేటి గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఆదివారం జరగనున్న గ్రూప్-1 పరీక్షల నిర్వహణను సంబంధిత అధికారులు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాజేశం అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో గల అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఆర్డీఓ రాజేశ్వర్‌తో కలిసి గ్రూప్-1 పరీక్షల లైజన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణ కొరకు జిల్లాలో 10 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో ఆసిఫాబాద్‌లో 5 కేంద్రాలు, కాగజ్‌నగర్‌లో ఐదు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ సూచనల ప్రకారం జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాలలో చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్, రూట్ అధికారులు, ఇన్విజిలేటర్లతో సమన్వయం చేసుకొని పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, దివ్యాంగ అభ్యర్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, ప్రశాంత వాతావరణంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించే విధంగా అధికారులు కృషి చేయాలని, జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు లైజన్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైజన్ అధికారులు, సంబంధిత అధికారులు తెలిపారు.

డిగ్రీలో చేరాలని అధ్యాపకుల ప్రచారం



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కళాశాల అధ్యాపకులు శనివారం నుండి ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గంలోని పాపన్‌పేట్, బెజ్జూరు, పెంచికల్‌పేట్, రుద్రాపూర్ తదితర గ్రామాలలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు కరపత్రాలు పంచడంతో పాటు డిగ్రీ ప్రవేశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ డి.జనార్దన్ మాట్లాడుతూ కళాశాలలో 840 సీట్లు అందుబాటులో ఉన్నాయని, ప్రస్తుతం దోస్త్ ప్రక్రియ ప్రారంభమైనందున విద్యార్థులు అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. కళాశాలలో ఉన్నత విద్యార్హత కలిగిన అధ్యాపకులతో డిగ్రీ తరగతుల నిర్వాహణ కెరీర్ కౌన్సిలింగ్ విభాగం ద్వారా వివిధ పోటీ పరీక్షలకు విద్యార్థులను ఇప్పటి నుండే సన్నద్ధం చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. అర్హులైన విద్యార్థులకు ఉపకారవేతనాలతో పాటు వసతిగృహ సదుపాయం ఉందని తెలిపారు. కంప్యూటర్ అధ్యాపకులు డి.శ్రీనివాస్ దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, ప్రేంకుమార్, మహేష్ పాల్గొన్నారు.

కాలని సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పట్టణంలోని హడుకో కాలనీలోని నీటి, డ్రైనేజీల సమస్యలు పరిష్కరించాలని ఎంఎం హెల్ప్ లైన్ ఫౌండేషన్ ఛైర్మన్, బీఆర్ఎస్ నాయకులు ఎండీ అహ్మద్ ఆధ్వర్యంలో కాలనీ వాసులతో కలిసి శనివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈఓ వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హడుకో కాలనీలో కుళాయిల ద్వారా నీరు రావడంలేదని దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తాగునీటి సమస్య వెంటనే పరిష్కరించాలని కోరారు. అదేవిధంగా వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా కాలనీలోనీ డ్రైనేజీలు శుభ్రపరచాలని కోరారు. సమస్యలు పరిష్కరిస్తానని ఈఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.

రేపు పోలీసుల ఆధ్వర్యంలో 2.5కే రన్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో ఈ నెల 12న కాగజ్‌నగర్‌లో 2.5కె తెలంగాణ రన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టౌన్ సీఐ బుద్దె స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఐదు గంటలకు స్థానిక ఎస్పీఎం క్రీడా మైదానం నుండి ప్రారంభమై లారీ చౌక్ మీదుగా ఎన్టీఆర్‌చౌక్ వరకు వెళ్లి తిరిగి మళ్లీ అదే దారి గుండా లారీ చౌక్ మీదుగా ఎస్పీఎం క్రీడా మైదానం వరకు ఈ రన్ ఉంటుందని తెలిపారు. ఈ తెలంగాణ రన్‌ను ఎస్పీ కె.సురేష్‌కుమార్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ రన్‌లో పాల్గొన్న వారిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి నగదు బహుతమలతో పాటు కన్సోలేషన్ బహుమతులు కూడా ఉంటాయని తెలిపారు. దీనిని ప్రజలు, యువకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు విజయవంతం చేయాలని కోరారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

వేంపల్లి-సిర్పూర్(టి) రైల్వే ట్రాక్‌పై దుర్గానగర్ విలేజ్ నంబర్ 10 సమీపంలో శనివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సురేష్ గౌడ్ తెలిపారు. బల్లార్షా నుండి మంచిర్యాల వైపుకు వెళ్తున్న గుర్తు తెలియని రైలు కిందపడి గుర్తు తెతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించలేదన్నారు. ఎల్లో కలర్ ఆఫ్ టీషర్ట్, గోధుమ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని, మృతునికి సుమారు 40 సంవత్సరాల వయసు ఉంటుందని, గుర్తింపు కొరకు సిర్పూర్(టి) ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపరిచినట్టు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు రైల్వే హెడ్ కానిస్టేబుల్ కే.సురేష్‌గౌడ్ సెల్ 9948481902, 8712658605 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికులను

నిరాశ పర్చిన సీఎం కేసీఆర్

నవతెలంగాణ-నస్పూర్



మంచిర్యాల జిల్లాలోని సమీకృత కలెక్టరేట్‌ను ప్రారంభించడానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి బహిరంగ సభలో కాంట్రాక్ట్ కార్మికుల గురించి ఒక మాట కూడా మాట్లాడలేదని, కాంట్రాక్ట్ కార్మికులు పడే శ్రమను గుర్తించలేదని వారిని నిరాశ పరిచారని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) డివిజన్ కార్యదర్శి మహేందర్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఉపరితల గనిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను అన్ని విధాల వినియోగించుకొని, వారి గురించి మాట్లాడకపోవడం కార్మికులను మోసం చేయడమే అవుతుందన్నారు. సింగరేణిలో ఉత్పత్తి అయ్యే ప్రతి బొగ్గు ఉత్పత్తిలో కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఉందనేది గుర్తించకపోవడం వారిని మోసం చేయడమే కాకుండా, వారి ఓట్లకు దూరం అవడమే అవుతుందని తెలిపారు. కాంట్రాక్టు కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూసిన చివరకు నిరాశే మిగిలిచ్చారని, రాష్ట్రవ్యాప్తంగా దశాబ్ది ఉత్సవాల జరుపుకుంటున్న నేపథ్యంలో సింగరేణిలో కూడా ఎంతో కోలాహలంగా దశాబ్ది ఉత్సవాలను జరుపుతున్న సింగరేణి యాజమాన్యం సైతం కాంట్రాక్టు కార్మికుల శ్రమను వాడుకుంటుందే తప్ప వారిని ఎక్కడ కూడా గుర్తించడం లేదని వాపోయారు. అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులపైన సవతి తల్లి ప్రేమని చూపిస్తూ, తమ నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. 73 షెడ్యూల్ పరిశ్రమలకు సంబంధించి ఐదు జీఓలు విడుదల చేసి సంవత్సరాలు గడుస్తున్న గెజిట్ చేయకుండా కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. గత సంవత్సరం జీఓ నెం. 22న గెజిట్ చేయాలని సింగరేణి వ్యాప్తంగా 18 రోజుల సమ్మె చేసిన, కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రికి మెమొరండాలు ఇచ్చినప్పటికీ కార్పొరేట్ల లాభార్జన కొరకు వాటిని గెజిట్ చేయకుండా తాత్సర్యం చేస్తున్నారన్నారు. ఇక్కడ ఉన్నటువంటి కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు కూడా కాంట్రాక్టు కార్మికుల సమస్యల మీద స్పందించి ముఖ్యమంత్రితో మాట్లాడించక పోవడం నమ్మకద్రోహమే అవుతుందని పేర్కొన్నారు. రేపు రాబోయే ఎన్నికలకు ఓట్ల కొరకు కూల్ బెల్టు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు వస్తే కాంట్రాక్టు కార్మికులు కనీసం దగ్గరికి కూడా రానివ్వమని, తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికుల సంఘం సీఐటీయూ డివిజన్ నాయకులు సంపత్, సమ్మయ్య, సాగర్, శ్రీనివాస్, తిరుపతి, శ్రీశైలం, అశోక్, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

రెబ్బెన : మంచిర్యాల బహిరంగ సభల్లో మాట్లాడిన ముఖ్య మంత్రి కేసీఆర్ కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాల గురించి మాట్లాడక పోవడం కార్మికులను తీవ్ర నిరాశకు గురి చేసిందని కాంట్రాక్ట్ కార్మికుల సంఘం(సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యాక్షుడు ఏ.ఓదెలు అన్నారు. సింగరేణికి వస్తున్న లాభాలలో కాంటాక్ట్ కార్మికుల పాత్రను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. అటు కోలిండియా చెల్లిస్తున్న రోజుకు రూ.1042 వేతనాలు అమలు కాక ఇటు రాష్ట్ర ప్రభుత్వ జీఓ అమలు కాక కాంట్రాక్టు కార్మికులు నలిగి పోతున్నారని కేవలం రోజుకు రూ.494 జీవితాలను వెళ్లదీస్తున్న కార్మికులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురియగుచున్నారు. కార్మికులు మళ్ళీ ఆందోళన బాట పట్టక ముందే కోల్ ఇండియా వేతనాలు అమలు చేయాలని లేదా జీఓ నంబర్ 22 ప్రకారము కనీస వేతనాలు చెల్లించాలని ఓదెలు డిమాండ్ చేశారు.

అనుమతుల పేరిట రోడ్డు పనుల అడ్డగింత

- ఎఫ్‌డీఓ కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమ గ్రామానికి రోడ్డు పనులను అటవీ అధికారులు అటవీ అనుమతులు లేవనే సాకుతో అడ్డకోవడాన్ని నిరసిస్తూ మండలంలోని రేగులగూడ పంచాయతీ గిరిజనులు శనివారం కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రేగులగూడ సర్పంచ్ లక్ష్మిరాంషా, కోసిని సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ రోడ్డు పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. రేగులగూడ పంచాయతీలో అంతర్గత రోడ్ల నిర్మాణం కోసం రూ. 16 లక్షలు మంజూరు కాగా ఈ పనులను అటవీ అధికారులు అనుమతులు లేవనే కారణంగా అడ్డుకుంటున్నారని అన్నారు. ఈ గ్రామంలో ఇప్పటికే మంచినీటి ట్యాంక్, పాఠశాల నిర్మాణాలు జరిగాయని, ఇపుడు రోడ్ల నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని అడ్డుకోవడం సరికాదని అన్నారు. ఎఫ్‌డీఓ విజయ్‌కుమార్, రేంజ్ అధికారి వేణుగోపాల్‌లు గిరిజనులకు నచ్చచెప్పే ప్రయత్నంచేసినా వారు వినలేదు. రెండు రోజుల్లోపు ఉన్నతాధికారుల నుండి అనుమతులు వచ్చే విధంగా చూస్తామని వారు హామీ ఇవ్వడంతో గిరిజనులు ధర్నా విరమించారు.

ఘనంగా జాజుల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల రథసారథి, నిరంతరం బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం గలమెత్తుతూ, దేశవ్యాప్తంగా బీసీ ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న జాజుల శ్రీనివాస్ జన్మదిన స్ఫూర్తితో బీసీలు ఐక్యమత్యంతో ముందుకు సాగాలని అన్నారు. రానున్న కాలంలో బీసీ ఉపకులాలు ఐక్యమై రాజ్యాధికారం సాధించుకోవడమే లక్ష్యంగా ఉండాలని, బీసీల ఆశయాలు నెరవేర్చే వరకు బీసీ ఉద్యమం ముందుకు సాగుతుందని దీనికోసం ప్రతి ఒక్కరు బీసీలు, బడుగు బలహీన సామాజిక వర్గ ప్రజలు కలిసికట్టుగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట వెంకన్న, గాజుల ఐక్కయ్య, మురళిగౌడ్, సంజీవ్, రాధిక, సుప్రజ, లలిత, సురేష్, నరేష్, ముజ్జు, పేంటు, నాగేష్ పాల్గొన్నారు.

రాజీమార్గం ద్వారా 430 కేసుల పరిష్కారం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కక్షిదారులు రాజీమార్గం ద్వారా 430 కేసులకు పరిష్కారం తీసుకున్నట్లు జిల్లా న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేష్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని స్థానిక కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌కు కక్షిదారుల నుంచి మంచి స్పందన వచ్చింది. లోక్ అదాలత్ అనంతరం పాత్రికేయులకు నిర్వహించిన సమావేశంలో జిల్లా న్యాయమూర్తి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కొమరంభీం జిల్లాలో 5 కోర్టులు, 4 బెంచులకు గానూ 430 కేసులు పరిష్కారం అయినట్లు తెలిపారు. ఆదివారం మరికొన్ని కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కారం అవుతాయని తెలిపారు. 7 ఏండ్లుగా కోర్టులో నడుస్తున్న భూమి కేసులో 60 మంది కక్షిదారులు, 6 గురు భూస్వాములు కలిసి రాజీ మార్గం ద్వారా తమ కేసును పరిష్కారం చేసుకున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులను ఇతర కోర్టులో అప్పీల్ చేసుకోవడానికి అవకాశం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ యువ రాజా, జూనియర్ సివిల్ జడ్జి ఉమామహేశ్వరి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ బాబు, న్యాయవాదులు సురేష్, నరహరి, రాజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : కక్షి దారులు పంతాలకు వెళ్లకుండా రాజీ కుదుర్చుకొని మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా జీవించాలని కక్షదారులకు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రవి సూచించారు. శనివారం జూనియర్ సివిల్ కోర్టులొ జాతీయ లోక్ ఆధాలాత్‌లో కాగజ్‌నగర్ పోలీస్ డివిజన్ పరిధిలో ఉన్నటువంటి కేసులు పరిష్కారం చేశారు. దీనిలో 412 సివిల్ కేసులు 51 బ్యాంకు సంబంధించిన కేసులను పరిష్కారం చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూకోర్టులలో కేసులు పెండింగ్ ఉండడం వలన కక్షిదారులు అన్ని రకాల ఇబ్బందులకు గురి అవుతారని పట్టింపులకు పోవడం వలన సమాజంలో ఒకరిపై ఒకరికి పగలు పెరుగుతాయి తప్ప స్నేహభావం పెరగదని అన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను లోకాదలాట్‌లో పరిష్కరించుకోవాలని దారులకు ఆయన సూచించారు.

బ్రిజ్ భూషణ్ సింగ్‌ని తక్షణమే అరెస్టు చేయాలి

ఆసిఫాబాద్ : రెస్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని రెజ్లర్ల పోరాటానికి ప్రతి ఒక్కరు మద్దతుగా నిలవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అల్లూరి లోకేష్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశానికి గోల్డ్ మెడల్స్ తీసుకొచ్చిన మహిళ రెజ్లర్లు తమపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌చరణ్ సింగ్ ను అరెస్టు చేసి, కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని గత 45 రోజులకు పైగా ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద పోరాటం నిర్వహిస్తున్నారని వారికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని అన్నారు. మే 28న రెజ్లర్లపై పోలీసుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికి ఉందని జంతర్ మంతర్ వద్ద ధర్నా శిబిరాలను తొలగించడం ఏంటని ప్రశ్నించారు. ఇండియా గేట్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామంటే అనుమతి ఇవ్వకుండా రెజ్లర్ల పోరాటంపై కేంద్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గమైన నిర్బంధకాండను ప్రయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్యదర్శి మృతి

నవతెలంగాణ-కెరమెరి



జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కరంజివాడ గ్రామ పంచాయతీ కార్యదర్శి మృతి చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. కరంజివడలో కార్యదర్శిగా పని చేస్తున్న, వేణు(28), అనార్‌పల్లి కార్యదర్శిగా పని చేస్తున్న ప్రశాంత్‌తో కలిసి స్వంత పనుల నిమిత్తం మంచిర్యాల వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని స్థానిక మోడల్ స్కూల్ సమీపంలో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో ప్రశాంత్, వేణు ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన చికిత్స నిమిత్తం వేణును చంద్రపూర్ తీసుకెళ్లే క్రమంలో మృతి చెందగా, ప్రశాంత్‌ని మంచిర్యాలలోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్

నవతెలంగాణ-నస్పూర్

ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం లక్ష్యమని ప్రభుత్వ విప్, చెన్నూర్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో శనివారం సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి.మధుసూదన్ నాయక్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నరేందర్, మంచిర్యాల శాసనసభ్యులు నడిపెల్లి దివాకర్రావు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి దాసరి వేణు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ప్రభాకర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో మారుమూల ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రానికి రావాలంటే దాదాపు వందల కిలోమీటర్లు ప్రయాణించి ఎంతో శ్రమ, వ్యయప్రయాలనకు ఓర్చి ఎంతో కష్టపడవలసి వచ్చేదని, ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికార వికేంద్రీకరణ చేస్తూ నూతన జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, పురపాలక సంఘాలు, గ్రామపంచాయతీలను ఏర్పాటు చేసి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవ చేశారన్నారు. ప్రజలు వివిధ రకాల ప్రభుత్వ సేవల కోసం జిల్లా కార్యాలయాల చుట్టూ తిరుగకుండా ప్రతి జిల్లాలో ఒకే చోట అన్ని ప్రభుత్వ సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్) భవనాన్ని ఏర్పాటు చేసి, వివిధ రకాల సేవల నిమిత్తం వచ్చే ప్రజల కోసం అన్ని శాఖలను ఒకే చోట కేంద్రీకృతం చేయడం జరిగిందని తెలిపారు. సాగు నీ టి పా ం ం ద ల ప్రాజెక్టులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, వైద్య కళాశాల, 1 వేయి 200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ లాంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, పర్యాటక రంగంలో కవ్వాల్ పులుల అభయారణ్యం, శివ్వారం, గాంధారి ఖిల్లా లాంటి ఎన్నో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.





నస్పూర్‌లో..

ఆసిఫాబాద్ : ప్రజలకు అత్యంత చేరువలో ప్రభుత్వ సేవలను అందించడం జరుగుతుందని ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ రైతువేదికలో ఏర్పాటుచేసిన సుపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాజేశం, చాహత్ బాజ్ పాయి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఆసిఫాబాద్ శాసనసభ్యులు ఆత్రం సక్కులతో కలిసి వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలో ఉన్న హక్కుల ప్రకారం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలతో తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నామని, రాష్ట్ర ఏర్పాటు తర్వాత ప్రజలకు సుపరిపాలన అందించేందుకు ప్రభుత్వం చేపట్టిన నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఏర్పడిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఉమ్మడి అదిలాబాద్ జిల్లాలో జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వందల కిలోమీటర్లు ప్రయాణించవలసి వచ్చేదని, జిల్లా ఏర్పాటుతో ప్రజలకు చేరువలో జిల్లా కేంద్రం ఉండడంతో సేవలు వేగవంతంగా అందుతున్నాయని అన్నారు. పాలన సులభతరంగా అందించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మీ, ఆసిఫాబాద్ శాసనసభ్యులు ఆత్రం సక్కులు మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటు తర్వాత జిల్లాల విభజన ద్వారా ప్రజలకు ప్రభుత్వ సత్వర సేవలు అందుతున్నాయని, ఆసిఫాబాద్ జిల్లాలో మూడు మండలాలు నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందని, కాగజ్‌నగర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు తండాలు, గూడాలను కలుపుతూ 166 నూతన గ్రామపంచాయతీలు ఏర్పాటు చేయడం జరిగిందని, దీనితో ప్రజలకు అతిచేరువగా సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తీసుకురావడం ధరణి పోర్టల్ ద్వారా ఒకేరోజులో పట్టా మార్పిడి సులభతరం అయ్యిందన్నారు. ఇదే తరహాలో అన్ని శాఖలలో ఎన్నో సంస్కరణలు తీసుకురావడంతో ప్రజలకు కార్యాలయాల చుట్టూ తిరుగకుండా మీ సేవల ద్వారా ధృవపత్రాలు పొందుతున్నారని తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తున్నారని, దీనితో అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని, క్షేత్రస్థాయిలో ఉద్యోగుల పనితీరు చాలా కీలకంగా ఉందని, ప్రజా సమస్యల పరిష్కారంలో ఉద్యోగులు, అధికారులు ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, ఈ ఘనత ఉద్యోగులు అధికారులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే సేవలకు నిర్ణీత సమయం నిర్ణయించి అమలు చేయడంతో అభివృద్ధి సాధిస్తున్నామని అన్నారు. అధికారులు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని, ప్రజలతో మమేకమై పనిచేయాలని, సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజేశ్వర్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, పీఏసీఎస్ ఛైర్మన్ అలీబిన్ అహ్మద్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో..